ప్రజాశక్తి
బుధవారం 17 సెప్టెంబర్ 2025
శ్రీ సత్యసాయి

జిల్లా అభివృద్ధిపై దిశానిర్దేశం

పుట్టపర్తి అర్బన్ : ఏపీ సచివాలయంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కలెక్టర్లు, ఎస్పీల సమావేశం జరిగింది. సోమవారం నాడు ఎస్పీలతో సమావేశం జరగ్గా, మంగళవారం కలెక్టర్, ఎస్పీలు ఇద్దరితో ముఖ్యమంత్రి చర్చించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా నుంచి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, సతీష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జిల్లా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్, ఎస్పీకి దిశా నిర్దేశం చేశారు.

సదస్సులో పాల్గొన్న కలెక్టర్

జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మినారాయణ

90 నిమిషాల్లో ముగించారు..!

- ◆ తూతూ మంత్రంగా జెడ్పీ..!
- ◆ అధికార పార్టీ నుంచి ఎంపీ ఒక్కరే హాజరు
- ◆ కనీస గౌరవం లేదని సభ్యుల ఆవేదన

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా నడిచింది. ఒకటిన్నర గంటలోపే సమావేశాన్ని మమ అనిపించారు. అధికారపార్టీ నుంచి అనంతపురం ఎంపి అంబికా లక్ష్మినారాయణ ఒక్కరే సమావేశంలో పాల్గొనగా తక్కిన ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు గైర్హాజయ్యారు. జెడ్పీటీసీ, ఎంపిపిలు అడిగిన ప్రశ్నలకు అధికారపార్టీ తరుపున ఎంపిక అంబిక ఒక్కరే సమాధానాలివ్వాల్సి వచ్చింది. ఎందుకంటే జెడ్పీలో ఎంపిపి, జెడ్పీటీసీలు అందరూ వైసిపికి చెందిన వారే ఉన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కూడా వైసిపి నుంచే ఉండటంతో ప్రభుత్వం తరుపున సమాధానం ఎంపి ఒక్కరే ఇవ్వాల్సి వచ్చింది. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన జిల్లా పరిషత్ హాలులో సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో విద్య, వైద్యం, వ్యవసాయంపై చర్చించారు.

సమావేశంలో పాల్గొన్న ఎంపిపిలు, జెడ్పీటీసీలు

జెడ్పీటీసీలకు కనీస గౌరవ లేదా..?

జెడ్పీటీసీలంటే కనీస గౌరవ లేదా అని అనంతపురం జెడ్పీటీసీ ప్రశ్నించారు. స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలను అనేక పాఠశాలల్లో నిర్వహించారని, చాలా జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఆ వేడుకల సందర్భంగా కనీస ప్రోటోకాల్ పాటించలేదని చెప్పారు. ప్రజాప్రతినిధి కాని వారిచేత పతాకావిష్కరణ చేయించడం ఏమిటన్నారు. దీనిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆయన అడిగారు. దీనిపై విచారణ చేపట్టి ప్రోటోకాల్ పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని అనంతపురం జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు.

గౌరవ వేతనం మూడు సంవత్సరాలుగా లేదు

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన తమకు మూడు సంవత్సరాలుగా గౌరవ వేతనం ఇవ్వడం లేదని రొద్దం జెడ్పీటీసీ తెలిపారు. ఇస్తారో.. ఇవ్వరో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. జడ్పిటిసిలు, ఎంపిటిసిలకు కూడా గౌరవ వేతనం లేదన్నారు. ఇటువంటి తరుణంలో సమావేశాలు ఏ విధంగా రావాలో చెప్పాలని ప్రశ్నించారు. జిల్లా పరిషత్ సిఇఒ స్పందిస్తూ ప్రభుత్వ స్థాయిలో ఇటీవలనే చర్చ జరిగిందని, త్వరలో ఈ వేతనాలు వచ్చే అవకాశాలున్నాయని సమాధానం చెప్పారు.

ఆర్డీటీని కాపాడాలి

ఆర్డీటీని కాపాడేందుకు ప్రభుత్వం తరుపున చర్యలు తీసుకోవాలని కంబదూరు జెడ్పీటీసీ అడిగారు. ప్రభుత్వం కాపాడే చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదని చెప్పారు. దీనిపై ఎంపి అంబికా లక్ష్మినారాయణ మాట్లాడుతూ అటువంటిదేమి లేదని ప్రభుత్వం స్థాయిలో పూర్తిస్థాయిలో కృషి చేయడం జరుగుతోందన్నారు. వారం, పది రోజుల్లోపు ఆర్డీటీ లైసెన్సు పునరుద్ధణ జరుగుతుందని చెప్పారు.

అయ్యవారిపల్లి శోత్రియం భూములు కాజేత

శెట్టూరు మండలం అయ్యవారిపల్లిలో 200 ఎకరాల శోత్రియం భూములు ఎక్కడివారే కాజేస్తున్నారని శెట్టూరు జెడ్పీటీసీ ఆరోపించారు. సాగులో స్థానికులుండగా బయటి వ్యక్తులు వచ్చి రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని తెలిపారు. దీనిపై అధికారులకు అనేకమార్లు ఫిర్యాదు చేసినా చర్యలుండటం లేదని చెప్పారు. దీనిపై ఎంపి అంబికా లక్ష్మినారాయణ మాట్లాడుతూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటారని చెప్పారు.

దళిత ఎంపిపి అంటే వివక్షా..?

మండలంలో మండల పరిషత్ సమావేశం తనకు తెలియకుండానే నిర్వహించాలని గుమ్మగట్ట ఎంపిపి తెలిపారు. ఇతర సమావేశాలు కూడా తనకు సమాచారం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దీనిపై తోటి సభ్యులు మద్దతుగా నిలిచారు. దళిత ప్రజాప్రతినిధి కాబట్టి ఇంతటి వివక్షా అని అడిగారు. దీనిపై జిల్లా పరిషత్ సిఇఒ స్పందిస్తూ ఆయన్ను బదిలీ చేసామని చెప్పారు. అయితే సభ్యులు దీనిపై మండిపడ్డారు. బదిలీ ఏమైనా చర్యనా అని అడిగారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జెడ్పీ సిఇఒ స్పందిస్తూ రెండు వారాల్లోపు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కార్పొరేట్‌కు అప్పజెప్పే కుట్ర

- ◆ వైద్య కళాశాలల నిర్వహణను ప్రభుత్వమే చూడాలి
- ◆ పిపిపి విధానాన్ని ఉపసంహరించుకోండి
- ◆ పెద్దల కోసం పేదలకు అన్యాయం చేయొద్దు
- ◆ సిపిఎం శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ

ప్రజాశక్తి-పెనుకొండ

పిపిపి విధానం పేరుతో ప్రభుత్వ వైద్య కళాశాలలను కార్పొరేట్లకు అప్పజెప్పే కుట్ర సాగుతోందని, దీనిని తక్షణం విరమించుకోవాలని సిపిఎం శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో అర్ధాంతరంగా ఆగిన వైద్య కళాశాల నిర్మాణాలను సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న వైద్య కళాశాలలను ప్రభుత్వమే తక్షణం పూర్తి చేయాలన్నారు. పీపీపీ విధానం ద్వారా వైద్య కళాశాల నిర్మాణం చేపడితే పేద మధ్యతరగతి పిల్లలు విద్యను కొనుక్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలా మారుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఆదానీ, అంబానీ తదితర కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేందుకు పూనుకోవడం విచారకరం అన్నారు. చైనా, రష్యా తదితర దేశాల్లో వైద్య విద్య రూ.40 లక్షల్లో పూర్తి అవుతున్నా మన దేశంలో దాదాపు కోటి రూపాయలు అవుతోందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు మంచి మెరిట్‌తో ర్యాంకులు సాధించి తక్కువ ఖర్చుతో వైద్య విద్యను అభ్యసించాలంటే ప్రభుత్వమే వైద్య కళాశాల నిర్మాణం చేసి పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు భాగస్వామ్యం అయితే వైద్య అత్యంత ఖరీదుగా మారే ప్రమాదం ఉందన్నారు. పిపిపి విధానం ద్వారా వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేయాలని చూస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు.

నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న సిపిఎం పార్టీ, ప్రజాసంఘాల నాయకులు

ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందాలంటే వైద్య కళాశాలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్మాణం చేపట్టాలన్నారు. నిర్మాణ దశలో ఆగిపోయిన 12 వైద్య కళాశాలకు రూ.8వేల కోట్లు ఖర్చు చేస్తే పూర్తి అవుతాయన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ ప్రయివేటు భాగస్వామ్యంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందదన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రభుత్వమే ఈ కళాశాలను పూర్తి చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈరేష్, నామాల నాగార్జున మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో తాము అధికారంలోకి వస్తానే జీవో నెంబర్ 107, 108 రద్దు చేస్తాం అని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. తక్షణం పిపిపి విధానాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్యకళాశాలల అంశాన్ని మరోసారి పునరాలోచించాలన్నారు. ప్రభుత్వమే కళాశాల నిర్మాణం చేపట్టి పేద, మధ్యతరగతి వర్గాలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు తోడ్పడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాబావలి, గంగాధర్, మహబూబ్ బాషా, నాగరాజు, హనుమంతు, సుధాకర్, హబీబ్ వలి, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

నేడు జిల్లాకు యుటిఎఫ్ రణభేరి

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరి జాతా బుధవారం శ్రీసత్యసాయి జిల్లాకు రానుంది. ఇందులో భాగంగా కదిరి పట్టణంలో ప్రవేశిస్తుందని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, కార్యదర్శులు సి.తాహిర్‌వలి, వైవి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎంఆర్‌సి ప్రాంగణంలో మంగళవారం జిల్లా నాయకులు మల్లికార్జున, ఆజమ్‌బాషా, సునీల్ కుమార్, సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 12వ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు, డిఎలు, ఆర్థిక బకాయిల చెల్లింపు, యాప్‌ల భారం తగ్గింపు, సిపిఎస్ రద్దు, ఒపిఎస్ అమలు, తదితర డిమాండ్ల సాధనకై తలపెట్టిన జాతాలో ప్రతి ఉపాధ్యాయుడు పాల్గొనాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ నాయకులు మధుసూదన్, రమేష్, రాజేష్, ఖాజాపీర్, రవివర్ధన్‌రెడ్డి, బ్రహ్మేంద్ర, నజీర్, సుధాకర్, రమణనాయక్, మనోహర్, ప్రసాద్, బాలాజీనాయక్, ఇర్ఫాన్, భార్గవ్, జబిఉల్లా, ఖాదర్‌బాషా, నాగరాజు, నాగరాజునాయక్, నారాయణరెడ్డి, రామసుబ్బయ్య, అయూబ్‌బాషా, కిషోర్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటి ఇంజినీరింగ్ కళాశాలలో

విద్యార్థిని ఆత్మహత్య

ధనలక్ష్మి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రం మండలంలోని ఎస్ఆర్ఐటి కళాశాలలో ఓ విద్యార్థిని మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... శ్రీ సత్యసాయి జిల్లా పెనుగొండ పట్టణానికి చెందిన కురువ నాగరాజు కూతురు ధనలక్ష్మి(20) ఎస్ఆర్ఐటి కళాశాలలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ తృతీయ సంవత్సరం చదువుతోంది. ఎస్ఆర్ఐటి హాస్టల్‌లోనే ఉంటూ విద్యాభ్యాసం చేసేది. అందరితో కలివిడిగా ఉంటే ధనలక్ష్మి సోమవారం ఉదయం కళాశాలకు వెళ్లకుండా హాస్టల్‌లోని తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మధ్యాహ్నం హాస్టల్ గదికి వచ్చిన తోటి విద్యార్థినులు ధనలక్ష్మి ఆత్మహత్య విషయాన్ని గుర్తించి కళాశాల అధ్యాపకులకు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కాగా విద్యార్థిని ఆత్మహత్యకు కారణాలు ఏమిటన్నది తెలియాల్సి ఉంది. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు తెలియజేస్తామని పోలీసులు తెలిపారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేద్దాం

జెడ్పీలో విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జ్యోతిబా పూలే దంపతుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని వారి ఆశయాల సాధనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ సొంత నిధులతో ఏర్పాటు చేసిన 6 అడుగుల సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యురాలు మంగమ్మ, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల జాయింట్ కలెక్టర్లు శివ్ నారాయణన్ శర్మ, అభిషేక్ కుమార్‌తో పాటు జిల్లాలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా పీడిత వర్గ స్త్రీల అభివృద్ధికి కృషి చేసిందన్నారు. మహిళా హక్కుల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిందని కొనియాడారు. నేటి తరం ఆమె త్యాగాలను తెలుసుకొని స్ఫూర్తి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో శివశంకర్, డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇఎస్ వెంకటేష్‌పై దాడికి యత్నిస్తున్న వెలుగు సిసి

వెలుగు సిసి గూండాగిరి..!

అవినీతిని ప్రశ్నించిన సిపిఎం నేతపై దాడి - ఉద్యోగి తీరుపై ప్రజాసంఘాల ఆగ్రహం

ప్రజాశక్తి-బుక్కపట్నం

మహిళా సంఘాల ఆర్థిక కార్యకలాపాల వ్యవహారంలో జరిగిన అవినీతిని ప్రశ్నించిన సిపిఎం జిల్లా నాయకునిపై వెలుగు సిసి గూండాగిరికి దిగి దాడి చేశాడు. తాను ప్రభుత్వ శాఖలో పని చేస్తున్నానన్న స్పృహ కోల్పోయి ఓ వీధి రౌడీలా ప్రవర్తించి ఏకంగా భౌతికదాడికి పాల్పడడం విస్మయానికి గురి చేస్తోంది. శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం మండల కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి.... బుక్కపట్నం శ్రీ సంతోషిమాత పొదుపు సంఘంలో అవినీతి జరిగిందని ఇటీవల పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తం అయ్యాయి. ఇదే విషయంపై పలు పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీనిపై సిపిఎం నాయకులు స్పందించి పీడీకి వినతిపత్రం అందజేశారు. ఇది జరుగుతుండగానే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సంఘం సభ్యురాలు కోమల ఆమె కుటుంబ సభ్యులు సంఘంలోని ఇతర సభ్యులపై దాడికి ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఇఎస్.వెంకటేష్ మంగళవారం ఉదయం వెలుగు కార్యాలయానికి వెళ్లారు. అక్కడ వివరాలు అడుగుతున్న సమయంలో సీసీ రవీంద్ర, నాగరాజులు నానా దుర్భాషలాడుతూ ఒక్కసారిగా ఇఎస్.వెంకటేష్‌పై దాడి చేశారు. అకారణంగా దౌర్జన్యం చేస్తున్న ఆ అధికారులను అక్కడున్న వారు అడ్డుకున్నారు. అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే ఇలా దాడులు చేయడం ఏమిటంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఇఎస్ వెంకటేష్ సిపిఎం జిల్లా నాయకుడు బ్యాళ్ల అంజితో కలిసి దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అవినీతిని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..?
ఇఎస్.వెంకటేష్

పుట్టపర్తి అర్బన్: బుక్కపట్నం డ్వాక్రా సంఘానికి సంబంధించిన డబ్బులు స్వాహా ఘటనకు సంబంధించి అధికారులు తీరుపై నిరసన తెలియజేసేందుకు వెళ్లిన ప్రజాసంఘాల నాయకులపై భౌతిక దాడులు చేయడం అత్యంత దుర్మార్గమని, దాడికి పాల్పడిన సీసీ, బుక్ కీపర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఇఎస్.వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం పుట్టపర్తిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డ్వాక్రా గ్రూపు సభ్యులకు సంబంధించి పెద్ద మొత్తంలో నగదు స్వాహా ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని తాము డిమాండ్ చేశామన్నారు. ఓ మహిళ ఎనిమిది లక్షల రూపాయలు స్వాహా చేసి ఇల్లు నిర్మించుకుందన్నారు. దీనిపై ఇతర గ్రూపు సభ్యులు ప్రశ్నిస్తే కుటుంబ సభ్యులతో కలిసి దాడి చేశారన్నారు. ప్రతినెలా డ్వాక్రా గ్రూపునకు సంబంధించిన నగదు జమ చేసే క్రమంలో ఎపిఎం, సిసి ఇతర అధికారులు పరిశీలించాల్సి ఉన్న పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అధికారుల తీరుపై నిరసన తెలియజేసేందుకు వెళితే ప్రజా సంఘాల నాయకులపై భౌతిక దాడులకు దిగి బెదిరింపులకు గురి చేయడమేంటని ప్రశ్నించారు. తక్షణమే పోలీసులు వారిపై కేసు నమోదు చేయాలన్నారు.

సిసిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న సిపిఎం నాయకులు

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి
సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ

సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఈఎస్.వెంకటేష్‌పై దాడి చేసిన వెలుగు సిసిపై తక్షణం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శ్రీ సంతోషిమాత సమైక సంఘంలో నిధులు గోల్మాల్‌పై వివరాలు తెలుసుకునేందుకు వెళ్తే ఇలా దాడి చేయడం దుర్మార్గం అన్నారు. దాడికి పాల్పడిన సిసి రవీంద్ర, నాగరాజులను అరెస్టు చేయాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా కేంద్రానికి అవసరమైన అన్ని అర్హతలు ఉన్న హిందూపురాన్ని ప్రభుత్వం వెంటనే జిల్లా కేంద్రంగా ప్రకటించాలని రాజకీయ ఐక్య పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రోడ్లు భవనాల అతిథిగృహంలో రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్యామ్ కిరణ్, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏ.శ్రీనివాసులు, ఎం.ఎస్.ఎఫ్. జిల్లా అధ్యక్షులు రవికుమార్, హిందూపురం ట్రేడ్ యూనియన్ నాయకులు అమానుల్లా, సమాజవాది పార్టీ తౌసిఫ్, ఆలిండియా బి. ఎస్.పి జిల్లా అధ్యక్షులు హరికుమార్, ఎంఐఎం పార్టీ మున్నా, జై భారత్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, ఏపీ ఆర్.ఎస్.పి పార్టీ కోడుమూరు ప్రసాద్, దళిత సమైక్యత జిల్లా అధ్యక్షులు ఎస్.నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో 32 జిల్లాలు ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం ఏడుగురు మంత్రులను కమిటీగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మంత్రుల కమిటీ ఇచ్చే నివేదికపై ఆధారపడి కొన్ని జిల్లాలు సవరిస్తారన్నారు. కొన్ని జిల్లాలను కొత్తగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని, ఈ తరుణంలో ఆ కమిటీ సభ్యులకు, రాష్ట్ర ప్రభుత్వానికి హిందూపురం ప్రజల తరపున రాజకీయ పార్టీల ఐక్యవేదిక కోరుతోందన్నారు. హిందూపురాన్ని జిల్లా కేంద్రం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు బ్రెయిన్ డెడ్

అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

'తనకున్నది ఒక్కగానొక్క కుమారుడు.. అతడికి 3 నెలల వయసు ఉన్నప్పుడే భర్త మృతి చెందాడు. దీంతో తల్లి తండ్రి తానై కొడుకును బాధ్యతగా పెంచింది. ఆ బిడ్డ ప్రమాదవశాత్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పలు ఆసుపత్రుల్లో చూపించినా ప్రయోజనం లేకపోయింది. చివరకు బ్రెయిన్ డెడ్ అని వైద్యులు తేల్చారు. అయితే ఇంతటి దు్ఃఖంలోనూ ఆ తల్లి అవయవ దానానికి అంగీకరించింది. ఆ యువకుడు చనిపోతూ.. ఆరుగురికి కొత్త జీవితాన్నిచ్చాడు. రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయిన నవీన్ అవయవాలను దానం చేసి తన తల్లి ఆదర్శంగా నిలిచారు. వివరాలు.. మండలంలోని తుమ్మలకుంట గ్రామానికి చెందిన అశ్వత్థప్ప, గీత దంపతుల కుమారుడు నవీన్(21) అద్దె బొలెరో వాహనం నడుపుతూ జీవనం సాగించేవాడు. ఈ నెల 13వ తేదీ బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడటంతో తలకు గాయమై స్పృహ కోల్పోయాడు. దీంతో హుటాహుటిన బెంగళూరుకు తరలించి పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించారు. రెండు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన నవీన్ సోమవారం రాత్రి తుది శ్వాస విడిచాడు. అయితే నవీన్ బ్రెయిన్ డెడ్ అయ్యాడని, అవయవాలు సక్రమంగా ఉన్నాయని వైద్యులు నిర్ధారించారు. దీంతో కన్నీరు ఆగకపోయినా, వేదన తట్టుకోలేకపోయినా నవీన్ తల్లి, కుటుంబ సభ్యులు అతని అవయవాలను దానం చేయడానికి ముందు కొచ్చారు. నవీన్ కిడ్నీలు, కాలేయం, గుండె, కళ్లను దానం చేశారు. బిడ్డను కోల్పోయిన బాధలోనూ మరో ఆరుగురికి కొత్త జీవితం ప్రసాదించారు.

నవీన్ (ఫైల్‌ఫొటో)

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి అర్బన్

రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో రూ. 17 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు మంగళవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో పట్టణంలో ఏ వార్డులోకి వెళ్లినా వీధులన్నీ గుంతలమయమై, చిన్నపాటి వర్షం కురిసినా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారు. దీంతో ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే విస్తృతంగా సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, టిడిపి నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్‌ఉన్నీసా, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, బహుద్దీన్, బాబాఫకృద్దీన్, శ్రీనాథ్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులకు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

తల్లిపాల కేంద్రం ప్రారంభం

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రోటరీ క్లబ్ సహకారంతో ఏర్పాటు చేసిన తల్లి పాల కేంద్రాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. ప్రయాణ సమయంలో బస్సుల కోసం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వేచి ఉన్న చిన్నపిల్లల తల్లుల సౌకర్యార్థం రోటరీ క్లబ్ తీసుకున్న నిర్ణయాన్ని ఎమ్మెల్యే ప్రశంసించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్ ఉన్నీసా, టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, నాయకులు బహుద్దీన్, అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గాండ్లపెంట

విద్యార్థులకు విలువలు, క్రమశిక్షణ, నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం, కెమిస్ట్రీ ల్యాబ్, కిచెన్, గార్డెన్, తదితర భవనాలను మంగళవారం ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జడ్పీ హైస్కూల్‌కు రూ. 42 లక్షలు మంజూరు చేయడంతో రెండు నూతన భవనాల నిర్మాణం చేపట్టామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. అనంతరం ఇటీవల అనకాపల్లిలో జరిగిన మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ప్రతిభ చాటిన ఎస్.లోకేశ్వరి కి బంగారు, ఎఫ్.పర్వానకు వెండి, పి.మౌలాలికి కాంస్య పతకం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.బాబురావు, ఎంపిపి జి. సోమశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం టి.ప్రసాద్, ఎస్ఎంసి ఛైర్మన్ రెడ్డి నాయక్, ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్‌అలీ, రత్నం, తాహెర్‌అలీ, పిఇటి హరి, టిడిపి మండల కన్వీనర్ సి.కొండయ్య, సర్పంచులు ఎస్.రహంతుల్లా, ఎస్.శివప్పనాయుడు, నాయకులు ఎ.వెంకటరమణారెడ్డి, ప్రసాద్, డి.ఆనంద్, అక్రమ్‌బాషా, నరసింహా, దాసిరెడ్డి, చంద్ర, ఉప సర్పంచి లక్ష్మీనర్సారెడ్డి, ఎస్‌వి.సికిందర్, కూటమి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

విద్యుత్ శాఖ ఉద్యోగుల నిరసన

లేపాక్షి : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. స్థానిక ఆ శాఖ కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ ఈ నెల 17, 18 తేదీల్లో సర్కిల్ ప్రధాన కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో ధర్నాలు, 19, 20 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు, 22న శాంతి ర్యాలీ నిర్వహించి కలెక్టర్లకు వినతి పత్రాలు ఇస్తామన్నారు. ఏఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దశల వారీగా చేపట్టనున్న ఈ ఆందోళన కార్యక్రమాలను డిస్కం పరిధిలోని అన్ని సర్కిల్ ప్రధాన కేంద్రాల్లో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అందుబాటులో యూరియా

గుడిబండ : మండలంలోని దేవరహట్టి గ్రామ సచివాలయంలో యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ తెలిపారు. అవసరమైన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే టోకన్లు ఇస్తారన్నారు. టోకెన్ పొందిన రైతులకు యూరియా పంపిణీ చేస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగింపు

గోరంట్ల : పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించుకున్న ఇంటిని మంగళవారం రెవెన్యూ అధికారులు జెసిబితో తొలగించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని తహశీల్దార్ మారుతి హెచ్చరించారు.

సైబర్ క్రైంపై అవగాహన

తాడిమర్రి : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ధర్మవరం డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శశికళ, కరుణాకర్ నాయుడు సైబర్ క్రైం, బాల్య వివాహాలు, పొగాకు, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయ బృందం, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోషణ మాసోత్సవాలు

పుట్టపర్తి రూరల్ : జిల్లాలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకూ పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రమీల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎనుములపల్లి పిహెచ్‌సిలో బుధవారం మాసోత్సవాలు ప్రారంభమవుతాయని, నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలు, ప్రాజెక్టు కార్యాలయాలు, మండల స్థాయిలో నిర్వహిస్తారన్నారు.

17 నుంచి 'ప్రధానమంత్రి మాతృత్వ యోజన'

సోమందేపల్లి : ఈ నెల 17 నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకూ చేపట్టనున్న ప్రధాన మంత్రి మాతృత్వ యోజన కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని సిడిపిఒ శాంతలక్ష్మి అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. సోమందే పల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సిడిపిఒ లబ్ధిదారుల వివరాలు అప్‌లోడ్ చేసే విధానం, అర్హత, విధి విధానాలను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది షాజహాన్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుభారాణి, లలితమ్మ, మంజుల, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపిడిఒ పరుష పదజాలంపై జెఎసి ఖండన

ప్రజాశక్తి-చిలమత్తూరు

తమ సమస్యలపై సచివాలయ ఉద్యోగులు వినతిపత్రం ఇవ్వడానికి స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వెళ్లగా వారిని అవమానించే రీతిలో మాట్లాడటం తగదని గ్రామ వార్డు సచివాలయ వికలాంగ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు, జెఎసి డిప్యూటీ జనరల్ అశ్వర్థ ఖండించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అసభ్య పదజాలం వాడటం ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే అన్నారు. ఉన్నతాధికారులు ఈ ఘటనపై విచారణ జరిపి ఎంపిడిఒపై శాఖాపరమైన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. ఎంపిడిఒ వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులంతా చిలమత్తూరు ఎంపిడిఒ కార్యాలయం ముందు పెద్దఎత్తున నిరసన చేపడతామని హెచ్చరించారు.

డా. రజిఉల్లాఖాన్‌కు మదర్ థెరీసా అవార్డు

ప్రజాశక్తి-కదిరి టౌన్

విజయవాడలోని డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు కళాక్షేత్రంలో సోమవారం మదర్ సర్వీస్ సొసైటీ తృతీయ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాముదుర్తి రజిఉల్లాఖాన్ సొసైటీ వ్యవస్థాపకుడు డా. మల్లాది ప్రసాద్‌రావు నుంచి మదర్ థెరీసా జాతీయ అవార్డు అందుకున్నారు. రజిఉల్లాఖాన్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు తన బాధ్యతను పెంచిందని తెలిపారు.

శరవేగంగా డ్రెయినేజీ పనులు

గోరంట్ల : పట్టణంలోని చింతా రామచంద్రారెడ్డి ఇంటి నుంచి ట్రెండ్స్ వరకూ చేపట్టిన డ్రెయినేజీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మంత్రి సవిత ఆదేశాల మేరకు రూ. 30 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ డ్రెయినేజీ కాలువ పనుల నిర్మాణానికి ఈ నెల 12వ తేదీ టిడిపి నాయకులు భూమిపూజ చేశారు. ఆ పనులను మంగళవారం నాయకులు బాలకృష్ణ చౌదరి, చింతా రామచంద్రారెడ్డి, కసిరెడ్డిపల్లి, రాజారెడ్డి, గుమ్మయ్యగారి పల్లి హరి పరిశీలించారు.

ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం

ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు ఆళ్లపాటి విద్యాసాగర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాజీలేని పోరాటం చేస్తామని రాష్ట్ర జెఎసి అధ్యక్షులు, ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్లపాటి విద్యాసాగర్ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆర్‌వి జానకి రామయ్య కళ్యాణ మండపం వరకూ మంగళవారం ఎపి ఎన్జీవో సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా నాయకుడు లింగ రామ్మోహన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా నూతన అడహక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా లింగ రామ్మోహన్, సభ్యులుగా శంకర్‌నారాయణ, వేణుగోపాల్‌రెడ్డి, లలితమ్మ, లోకేశ్వర్‌రెడ్డి, ఈశ్వరప్ప, తదితరులను ఎన్నుకున్నారు. ఆళ్లపాటి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. త్వరలోనే ప్రభుత్వం డిఎలు, పిఆర్‌సిని ప్రకటిస్తుందనే ఆశాభావంతో ఉన్నామన్నారు. చర్చలు ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చనే నమ్మకంతో ఉన్నామన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాలే శరణ్యమన్నారు. సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు సైనికుల్లా పోరడడానికి సిద్ధంగా ఉండాలన్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివి.రమణ, నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో ఇల్లు లేని పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ ఛైర్మన్ డిఇ. రమేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయ ఆవరణంలోని కౌన్సిల్ హాలులో అంగీకార్ 2025 కరపత్రాలను మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస తో కలిసి ఛైర్మన్ రమేష్ కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాజ్ యోజన 2.0 పథకం కింద హిందూపురం పురపాలక సంఘంలో 427 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సొంత స్థలం ఉండి, ఇల్లు లేని వారికి కేంద్ర ప్రభుత్వం రూ. 1.50 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం రూ. 1 లక్ష సబ్సిడీ కింద మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇళ్ల నిర్మాణాల అనంతరం ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకానికి ఎంపిక చేస్తామన్నారు. వీరితోపాటు ఇప్పటికే పిల్లలు మంజూరు చేసిన వారిని సైతం లబ్ధిదారులుగా ఎంపిక చేసి సూర్యగ్రహ యోజనలో అవకాశం కల్పిస్తామన్నారు. ఈ పథకాన్ని సొంత స్థలం ఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వెంకటేష్, కూటమి నాయకులు రాము, రమేష్ రెడ్డి, మునిసిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ చంద్రమ్మ, మెప్మా గంగులయ్య, గృహ నిర్మాణ శాఖ ఏఈ ఫణీంద్ర, ఆశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ డిఇ.రమేష్‌కుమార్

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్‌కుమార్ తెలిపారు. ఆయన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎమ్మెల్యే పిఎలు వీరయ్య, శ్రీనివాసరావు, బాలాజీ, అధికారులతో కలిసి మోడల్ కాలనీ-1లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రహదారులు, మురికి కాలువల నిర్మాణం చేపడతామని తెలిపారు. వారి వెంట కౌన్సిలర్ అంజలిరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు ప్రెస్ వెంకటేష్, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్స్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, ఇంజినీర్ దస్తగిరి, డీఈఈ మదన్‌కుమార్, ఏఈ జనార్ధన్, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

రొద్దం : పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో పెన్నానది అనుకుని ఉన్న సుబ్బారాయప్పగారి కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన పూజమ్మ ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు పూజారి తెలిపారు. పూజారి మాట్లాడుతూ ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటామ న్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆలయం వద్దకు చేరుకోగా తలుపులు తీసి ఉండడం గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి పరిశీలించారని తెలిపారు. అమ్మవారి 3 కిలోల వెండి ఆభరణాలు, 6 గ్రాముల బంగారు తాళిబొట్టు, రూ. 30వేల నగదు, పట్టుచీరలు చోరీకి గురైనట్లు తెలిపారు. ఆలయంలో గత మంగళవారం విగ్రహ ప్రతిష్టాపన చేపట్టి ఘనంగా జాతర నిర్వహించామని, ఇంతలోనే చోరీ జరగడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పెన్నా నది ఒడ్డున ఉన్న సత్యసాయిబాబా దేవాలయంలో కూడా చోరీ జరిగినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ తలుపులు పగలగొట్టి లోపల నానా హంగామా చేసినట్లు తెలిపారు. ఏడాదిలో మూడు ఆలయాల్లో చోరీలు జరిగినట్లు తెలుస్తోంది.

రైలు కిందపడి వ్యక్తి మృతి

హిందూపురం : పట్టణంలోని గుడ్డం ఆలయ సమీపంలో ఉన్న రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు హెడ్ కానిస్టేబుల్ శశికుమార్ తెలిపారు. సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అతడి వయసు 25 ఏళ్లు ఉంటుందని, సమాచారం తెలిస్తే పురం రైల్వే స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఓజోన్ పొరను కాపాడాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఓజోన్ పొర పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప, ప్రసన్న లక్ష్మి సూచించారు. మంగళవారం హిందూపురం మండల పరిధిలోని పూలకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, వాహనాల వాడకం తగ్గించాలన్నారు. క్రిమి సంహారక మందులు, రసాయన ఎరువుల వాడకం తగ్గినప్పుడే వాతావరణం దెబ్బతినకుండా ఉంటుందని తెలిపారు. పచ్చదనాన్ని పెంపొందించడం వల్ల మాత్రమే ఓజోన్ పొర దెబ్బ తినకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఓజోన్ పొర రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కేశవమూర్తి, పీడీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ గంగప్ప

నెలాఖరులోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

పంటలు సాగు చేసిన రైతులు నెలాఖరులోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏవో లోకేశ్వర్ రెడ్డి సూచించారు. మండలంలోని వెలిచెలమల, తాటిమానుగుంత గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించి, కంది పంట సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. అంతర పంటగా పెసర, మినుము సాగు చేసుకోవాలన్నారు. ఇప్పటికే కొన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, మరో రెండు రోజుల్లో మేకలచెరువు, మర్రికొమ్మదిన్నెలో రైతులకు యూరియా పంపిణీ చేస్తామన్నారు. ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. వెలిచెలమల, ధనియానిచెరువు గ్రామాల్లో నానో యూరియా అందుబాటులో ఉందన్నారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతులకు వచ్చే వారంలో విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. వేరుశనగ పంట కోత ప్రయోగాలను నెలాఖరులోపు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది నారాయణస్వామి, రైతులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టిన వ్యవసాయ అధికారులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని వక్తలు పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ జిల్లాస్థాయి ఉపాధ్యాయ అవార్డులు పొందిన మండలంలోని పూలకుంట ప్రధానోపాధ్యాయులు విజయరాణి, కేశవమూర్తి, సంతేబిదనూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నాగరాజును మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ గంగప్ప, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య మాట్లాడుతూ కండక్టర్ నుంచి కలెక్టర్ దాకా, రాష్ట్రపతి దాకా వారిని తయారు చేసేది ఉపాధ్యాయుడేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ప్రసన్నలక్ష్మి, సర్పంచి మంజునాథ్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పావని, సరస్వతి, వరలక్ష్మీ, ఉపాధ్యాయ నాయకులు నారాయణస్వామి, బాబు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం కేశవమూర్తిని సన్మానిస్తున్న ఎంఈఓ, వీరయ్య

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు : విఆర్‌ఎలు

ప్రజాశక్తి-హిందూపురం

సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతామని ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం కార్యదర్శి నారాయణప్ప హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం తహశీల్దార్ వెంకటేశుకు వినతి పత్రం ఇచ్చారు. సంఘంఅధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీ నరసప్ప, నారాయణప్ప మాట్లాడుతూ పే స్కేల్ అమలు చేయాలని, నామినీలను విఆర్‌ఎలుగా నియమించాలని, అర్హులకు ఉద్యోగోన్నతులు ఇవ్వాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు.ఆయన సమస్యలపై ఈ నెల 18, 19 తేదీల్లో తహశీల్దార్ కార్యాలయాల వద్ద, 20న ఆర్డీవో కార్యాలయం వద్ద, 22న కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు నిర్వహిస్తామన్నారు. అప్పటికీ పరిష్కరించకపోతే ఆందోళన లు మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహమూర్తి, రాజప్ప, విజయ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పురంలో తహశీల్దార్ వెంకటేశుకు వినతిని ఇస్తున్న విఆర్‌ఎలు

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

కొత్తచెరువు : విఆర్‌ఎల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.పెద్దన్న డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే మీ సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడాది న్నర అవుతున్నా నేటికీ తమ సమస్యలను పట్టించు కోలేదన్నారు. అర్హులైన విఆర్‌ఎలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని, కారుణ్య నియామ కాలు చేపట్టాల న్నారు. గతంలో విఆర్‌ఎలపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తేయాలని కోరారు.

వర్మీ కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పించండి

హిందూపురం : వర్మీ కంపోస్ట్ తయారీపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ సరస్వతి సూచించారు. మంగళవారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని తుమకుంట పంచాయతీలో ఉప మండల పరిషత్ అభివద్ధి అధికారి శివకుమార్‌తో పాటు పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వర్మీ కంపోస్ట్ తయారు చేసే షెడ్డు పరిశీలించి ఎరువు తయారీపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి, అన్ని సర్వీసులు వాట్సప్ మిత్ర ద్వారా అందించేందుకు పురోగతి పెంచాలని సచివాలయం సిబ్బంది కి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప, సచివాలయం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్, హరిత పాల్గొన్నారు.

'నేతన్న భరోసా' పథకాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్ అమలు చేయడంతో పాటు నేతన్న భరోసా పథకాన్ని ప్రారంభించాలని కోరారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసం వద్ద ఆయన వ్యక్తిగత కార్యదర్శి వీరయ్యకు చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఆ పథకాన్ని వెంటనే అమలు చేసి కార్మికులకు అండగా నిలవాలన్నారు. అలాగే 'నేతన్న భరోసా పథకం' వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు దేవరాజు, బాబు సాబ్, అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరయ్యకు వినతిని ఇస్తున్న చేనేత ఐక్య వేదిక సభ్యులు

ఎంపిటిసిలందరికీ నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని ఎంపిటిసిలందరికీ నిధులు కేటాయించాలని కోరుతూ మంగళవారం పలువురు ఎంపిటిసిలు ఎంపిడిఒ నరసింహమూర్తికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ జరిగిన మండల పరిషత్ సమావేశంలో లేపాక్షికి చెందిన ముగ్గురు ఎంపిటిసిలు, వైస్ ఎంపిపి అంజనరెడ్డి, పద్మావతమ్మ, కో ఆప్షన్ బషీర్‌కు ఎలాంటి సమాచారం లేకుండా ఎంపిపి నిధులు రూ. 92 లక్షల్లో అధికార పార్టీకి రూ. 46 లక్షలు కేటాయించి లేపాక్షి ఎంపిటిసిలకు నిధులు ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. స్పందించిన ఎంపిడిఒ వచ్చి త్వరలోనే మండల సమావేశం నిర్వహించి ఎంపిటిసిలందరికీ న్యాయం చేస్తామని, అప్పటి వరకూ ఎవరికీ నిధులు విడుదల చేయమని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మల్లన్న, చలపతి, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, నిసార్, అంజనరెడ్డి, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న ఎంపిటిసిలు

నేటి నుంచి ఉచిత వైద్యశిబిరాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ఈ నెల 17వ తేదీ ప్రారంభిస్తున్న 'స్వస్తి నారి- స్వశక్తి పరివార్ అభియాన్' కార్యక్రమన్ని విజయవంతం చేయాలని స్టేట్ నోడల్ ఆఫీసర్, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ కోరారు. డిఎంహెచ్ఓ డాక్టర్ ఫిరోజ్ బేగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రోగ్రామ్ ఆఫీసర్లు, డాక్టర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అడిషనల్ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం అన్ని శాఖలను భాగస్వామ్యం చేసి ప్రతి రోజూ ఎప్పటికప్పుడు నివేదికలను జిల్లా కార్యాలయానికి పంపాలన్నారు. బుధవారం మండల కేంద్రాల్లో స్థానిక నాయకులతో ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా అక్టోబర్ 2వ తేదీ వరకూ స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులపై పని భారం తగ్గించాలి

ప్రజాశక్తి-రొళ్ల

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల పని భారం తగ్గించాలని ఎపి స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఎపిఎస్‌టిఎ) రాష్ట్ర అధ్యక్షులు కాడిశెట్టి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఎపిఎస్‌టిఎ జిల్లా అధ్యక్షులు డి.మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవి.కృష్ణారెడ్డితో కలిసి మంగళవారం మడకశిర మండలంలోని బేగార్లపల్లి, కదిరేపల్లి, పాపసానిపల్లి, సిద్ధగిరి, గుండుమల, మడకశిర జడ్పీ హైస్కూళ్లలో సభ్యత్వ నమోదు చేపట్టారు. అలాగే ఉపాధ్యాయుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మడకశిర ఎంఆర్‌సిలో జిల్లా సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్ వేయాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఆర్థిక బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు డిఎలు, 11వ పిఆర్సీ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలన్నారు. మారుతి ప్రసాద్, ఎంవి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ బదిలీ అయి రిలీవర్ లేని కారణంగా తిరిగి పాత స్థానాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయడానికి చర్యలు తీసుకోవాల న్నారు. అంతర్ జిల్లా బదిలీలు జరిగిన తర్వాతే 2025 డీఎస్సీ ఉపాధ్యాయులకు స్థానాలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ప్రదీప్ కుమార్, డివిజన్ నాయకులు రమేష్, సురేష్, నాగరాజాచారి, మంజునాథ్, ఉమేష్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చేపట్టిన ఎపి ఎస్‌టిఎ నాయకులు

'మంత్రిని బహిష్కరించేందుకు నీవెవరు'..?

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్ర మంత్రి సవితను సవితచౌదరిగా పేర్కొంటూ తిరుపతిలో అక్టోబర్ 5వ తేదీ జరిగే భక్త కనకదాసు విగ్రహావిష్కరణ కార్యక్రమం నుంచి బహిష్కరిస్తున్నట్లు జబ్బల శ్రీనివాస్ ప్రకటించడం శోచనీయమని నియోజకవర్గ కురుబ సంఘం నాయకులు మండిపడ్డారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నువ్వు కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులేనా..? మిమ్మల్ని ఎవరు ఎన్నుకున్నారని ప్రశ్నించారు. నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. సిఎం చంద్రబాబుతో మాట్లాడి కనక దాసు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు మంత్రి సవిత చొరవ చూపారన్నారు. రాజకీయ ఉనికి కోసం రోజుకో పార్టీ మారే నీవు కురుబల ద్రోహి అన్నారు. కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా బోరంపల్లి ఆంజనేయులు కొనసాగుతున్నారని తెలిపారు. సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ దండు ఈశ్వరప్రసాద్, నాయకులు రామాంజనేయులు, పెద్దన్న, అశ్వర్థనారాయణ, రామకృష్ణ, సిద్ధలింగప్ప, రవికుమార్, శివకుమార్, ముత్యాలప్ప, నంజుండ, సోమందేపల్లి కురుబ సంఘం ప్రెసిడెంట్ శ్రీనివాసులు, రామచంద్ర, ఆదినారాయణ, నరేష్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కురుబ సంఘం నాయకులు

CHANGE OF NAME

SHAIK NOUSHAD S/o SUBAHAN(OLD NAME) D.NO:10-1098-243, Nizamvali Colony, KADIRI Town, SRI SATHYA SAI Dist, A.P

I changed my Father name **SUBAHAN (OLD NAME) TO SHAIK SUBHAN (NEW NAME)** Henceforth My Father Name As **SHAIK SUBHAN** for all purpose.

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో, కదిరి

I.A.No.1201/2023 in O.S.No.184/2012

Between:

హట్టుబాయి గారి నూర్జహాన్ W/o T.మహమ్మద్ గౌస్, D/o హట్టుబాయి గారి పెద్ద ఖాదర్‌వలి D.No 1-1120, అడపాల వీధి, కదిరి టౌన్, శ్రీ సత్యసాయి జిల్లా.

...పిటీషనర్/వాది

And

1) పఠాన్ ఖాజాబీ, W/o P. బషీర్ ఖాన్, D.No 16-822, D2, దర్గా వీధి, కుటాగుళ్ళ(గ్రామము & పోస్టు), కదరి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
2) ఎనుపు గొడ్ల వెంకటేష్, S/o లక్ష్మినరసప్ప,D.No 1-146, గౌనివారిపల్లి (గ్రామము & పోస్టు), గోరంట్ల మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
3) కనుముక్కల ఈశ్వరయ్య S/o గంగులప్ప, పోలంవాండ్లపల్లి (గ్రామము), H/o ఛారుపల్లి, నల్లమాడ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
4) మూడే రమేష్ నాయక్ S/o నారాయణ నాయక్, D.No 15-7, రెడ్డివారిపల్లి తాండా, H/o ముండ్లవారిపల్లి, తనకల్లు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

11,13,15,19 రెస్పాండెంట్‌లు

పై I.A.No.1201/2023లో పిటీషనర్ అయిన హట్టుబాయిగారి నూర్జహాన్ పిటిషన్‌ను పై కోర్టులు దాఖలు చేసియున్నారు. సదరు పిటిషనులో 11,13,15,19 రెస్పాండెంట్‌లకు తెలియజేయడం ఏమనగా పై పిటిషన్‌లో మీ హజరు నిమిత్తం పై కోర్టువారు 22/10/2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. కావున సదరు తేదీ నాడు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా కానీ పై కోర్టలో హజరై మీ యొక్క అక్షేపణలు, అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకొనవలయును, లేనిచో ఘనమైన కోర్టువారు పై పిటిషన్‌ను మీ నలుగురి పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా:22/10/2025
స్థలం: కదిరి

పూల శ్రీనివాసులు
పిటీషనర్ తరపు న్యాయవాది,
కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా

మహారాజాశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, కదిరి

E.P. No.2/2022 in O.S. No.74/2015

BETWEEN:

1. ఎదుగూరి పెద్ద వెంకటరెడ్డి, (Died by Lrs 2 to 7)
2. ఎదుగూరి వెంకటరమణమ్మ, భర్త లేట్. ఎదుగూరి పెద్ద వెంకటరెడ్డి, వయస్సు 60 సంవత్సరములు, నివాస చిరునామా ఇంటి. నెం. 1-75, దొరిగల్లు గ్రామము, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
3. ఎదుగూరి లోకేశ్వర రెడ్డి, తండ్రి. లేట్. ఎదుగూరి పెద్ద వెంకటరెడ్డి, వయస్సు 39 సంవత్సరములు, నివాస చిరునామా ఇంటి. నెం. 1-75, దొరిగల్లు గ్రామము, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
4. జి.వెంకట శివమ్మ, తండ్రి లేట్. ఎదుగూరి పెద్ద వెంకటరెడ్డి, భర్త జి.సిద్ధారెడ్డి, వయస్సు 44 సంవత్సరములు, నివాస చిరునామా ఇంటి. నెం. 3-145-C-11-D, ప్రశాంతి నగర్, మదనపల్లి, చిత్తూర్ జిల్లా.
5. జి.సులోచన, తండ్రి లేట్ ఎదుగూరి పెద్ద వెంకటరెడ్డి, భర్త లేట్ జి.చిదానంద రెడ్డి, వయస్సు 42 సంవత్సరములు, నివాస చిరునామా ఇంటి. నెం. 3-146-12-1, మాస్టర్ మైండ్ స్కూల్ దగ్గర, ప్రశాంతి నగర్, మదనపల్లి, చిత్తూరు జిల్లా.
6. జి. కృష్ణవేణి, తండ్రి లేట్. ఎదుగూరి పెద్ద వెంకటరెడ్డి, భర్త. జి. దామోదర్ రెడ్డి, వయస్సు 39 సంవత్సరములు, నివాస చిరునామా ఇంటి. నెం. 3-145-9-6-4A.21, ప్రశాంతి నగర్, మదనపల్లి, చిత్తూర్ జిల్లా.
7. పి. బృందా తండ్రి లేట్. ఎదుగూరి పెద్ద వెంకటరెడ్డి, భర్త మురళీమోహన్, వయస్సు 42 సంవత్సరములు, నివాస చిరునామా ఇంటి. నెం. 1-6B, వాటర్ ట్యాంక్ దగ్గర, బోడుముల్లువారిపల్లి గ్రామము, పీలేరు, చిత్తూర్ జిల్లా.

...డిక్రీహోల్డర్స్

మరియు

అజ్జుగుట్టు కేతిరెడ్డి ఓబీరెడ్డి, తండ్రి. అజ్జుగుట్టు కేతిరెడ్డి ఓబులరెడ్డి, వయస్సు 45 సంవత్సరములు, నివాస చిరునామా ఇంటి. నెం. 1-70, దొరిగల్లు గ్రామము, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

...జడ్జిమెంట్ డెట్టార్

వేలం ప్రకటన

పై దావాలో E.P డిక్రీహోల్డర్స్ తన E.P లో బాకీ మొత్తము రాబట్టు నిమిత్తమై జడ్జిమెంట్ డెట్టార్‌కు సంబందించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై కోర్టులో తేది: 06-10-2025న ఉదయం 10-30 గంటలకు వేలము జరుపబడును. ఆసక్తి గల వారు వేలములో పాల్గొనవచ్చునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

అనంతపురము రి.డి., హిందూపురం ఆర్.డి., ప్రస్తుతము శ్రీ సత్యసాయి జిల్లా రి.డి., పుట్టపర్తి ఆర్.డి., కదిరి సబ్ రి.డి.,కి చేరిన దొరిగల్లు రెవెన్యూ గ్రామం పరిగి, ముదిగుబ్బ మండలంలో గల

Govt Dry S.No.308-3, A.C.2-72 cents out of it Ac.0-45 cents only, within the following

Boundaries:

East : Land of A. Gopal Reddy & Muni Bhaskar,
West : Vanka,
North : Rastha & Vanka,
South : Land in S.Anjaneylu.
D.Hr. Value Rs. 2,00,000-00

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:6.10.2025
స్థలం:కదిరి

కె.నాగేంద్ర రెడ్డి, బి.ఎ., బి.యల్.,
డిక్రీహోల్డర్స్ తరపు న్యాయవాది,
కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా,
సెల్: 9440361798